నమస్తే తెలంగాణ
నిజామాబాద్, బుధవారం 28 మే 2025
WEDNESDAY, MAY 28, 2025

## 30న అక్షర కిరణోద్యమ ఆత్మీయ సమ్మేళనం

సుభాష్‌నగర్, మే27: కళాకారులందరినీ ఒకే వేదికపై తీసుకు రావడానికి ఈనెల 30న అక్షర కిరణోద్యమ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం, జిల్లా స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు ఖలీల్‌వాడీ న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ సిర్పలింగం తెలిపారు. మంగళవారం హమల్‌వాడీ మాతృసంస్థ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిర్పలింగం మాట్లాడుతూ 1991లో సంపూర్ణ అక్షరాస్యత సాధనలో ఉమ్మడి జిల్లాలోని కవులు, కళాకారులు పాల్గొని ప్రజలను చైతన్య పరచారని అన్నారు. 32 ఏండ్ల తర్వాత జిల్లా స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కవులు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కమిటీ ప్రతినిధులు రెడ్డి రాజయ్య, నర్సారెడ్డి, సాయిబాబు, రాజ్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

పొతంగల్, మే 27: మండలానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైనట్లు వ్యవసాయ సలహాదారు బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్కూల్ మండలంలోని పీఎస్‌ఆర్ నగర్ సోంపూర్ శివారులో నిర్మించనున్నట్లు తెలిపారు. స్కూల్ మంజూరు చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే పోచారం కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యాపార యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలి

సారంగాపూర్, మే 27: డ్వాక్రా సంఘాల సభ్యులు పొందుతున్న రుణాలతో ఆసక్తి కలిగిన వ్యాపార యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ రాందాస్ అన్నారు. మంగళవారం రూరల్ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రెడ్డి సునీత అధ్యక్షతన ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం మహేశ్‌కుమార్, మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

సిరికొండ, మే27: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్‌ఐడీ కోసం రైతులు వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఏఈవో నిఖిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చీమన్‌పల్లి రైతువేదికలో బుధవారం ఫార్మర్‌ఐడీ నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి రైతుకూ 11 అంకెలతో యూనిక్ కోడ్ ఐడీని అందజేయనున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టా పాసుబుక్, ఆధార్ జిరాక్స్, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ ఫోన్ తీసుకొని రావాలని కోరారు.

## 'రేవంత్ కుట్రతోనే నోటీసులు'

ఖలీల్‌వాడి, మే 27: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపించడాన్ని ఖండిస్తున్నట్లు జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతోనే ఏసీబీ నోటీసులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటి కూడా పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాలో డబ్బులు లేవంటూనే అందాల పోటీలు నిర్వహించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్నారని పేర్కొన్నారు. రైతుబంధు ఇవ్వడం లేదని, పెన్షన్లు పెంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. వీటిపై ప్రశ్నించిన కేటీఆర్‌కు నోటీసులు పంపిస్తున్నారని పేర్కొన్నారు.

## డ్రైనేజీల్లోని పూడిక తొలగించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు


డ్రైనేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

కంఠేశ్వర్, మే27: జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, ఆయా నివాస ప్రాంతాల్లోని మురుగు కాలువల్లోని పూడికతీత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. మురుగు కాలువల్లో పూడిక కారణంగా వాన నీరు రోడ్లపైకి వచ్చే అవకాశముందని అన్నారు. మంగళవారం బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులతో కలిసి కలెక్టర్ సమస్యాత్మక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ముఖ్య కూడళ్లలో ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న డ్రైనేజీలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కొత్తగా డ్రైనేజీలను నిర్మించాల్సిన స్థలాలను సందర్శించి మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పలుచోట్ల డ్రైనేజీలను ఆక్రమించుకుని నిర్మాణాలు కలిగి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. వానకాలంలో నగరంలోని ఏ ఒక్క ప్రాంతం కూడా జలయమంగా మారకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపజేయాలని, ఎక్కడా వాననీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట తాహెర్‌బిన్ హందాన్, గడుగు గంగాధర్, అంతిరెడ్డి రాజారెడ్డి, దిలీప్‌కుమార్, ఆనంద్‌సాగర్, నగేశ్‌రెడ్డి ఉన్నారు.

## పాఠ్యపుస్తకాలు తీసుకెళ్లాలి

కోటగిరి, మే 27: నూతన పాఠ్య, రాత పుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రానికి వచ్చాయని ఇన్‌చార్జి ఎంఈవో శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వచ్చి తీసుకెళ్లాలని, పాఠశాల పునః ప్రారంభం రోజే విద్యార్థులకు అందజేయాలని కోరారు.

## గర్భిణులు వ్యాయామం చేయాలి

ఇందల్వాయి, మే 27: గర్భిణులు రోజూ వ్యాయామం చేయాలని వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్యాధికారి సుశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. సాధారణ ప్రవసం కోసం యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి భువన, ఆరోగ్య విస్తరణాధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకుడు దేవపాలం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఉపాధిహామీ పనుల పరిశీలన

మోస్రా (చందూర్), మే 27: మోస్రా మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను జీపీ కార్యదర్శి శ్రావణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు.

## రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

ఖలీల్‌వాడి, మే 27: ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈనెల 29న ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల మూల్యాంకనం విధుల్లో పాల్గొనేందుకు ప్రభుత్వ ఎయిడెడ్ మోడల్, అన్ని రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఆయా సబ్జెక్టుల లెక్చరర్ల ఆర్డర్ కాపీలు కళాశాల లాగిన్లలో నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రిన్సిపాళ్లు మూల్యాంకన విధుల్లో పాల్గొనేందుకు అధ్యాపకులను రిలీవ్ చేయకపోతే ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధ్యాపకుల ఆర్డర్ కాపీలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాల లాగిన్లలో నుంచి డౌన్‌లోడ్ చేసుకుని 29న ఉదయం 10 గంటలకు నిజామాబాద్ ఖిల్లా బాలుర జూనియర్ కళాశాల వద్ద మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లు అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. నాట్ అపాయింట్‌మెంట్ లిస్ట్ ఉన్న అధ్యాపకులను కూడా మూల్యాంకనం విధుల్లోకి తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యాధికారి తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి


సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

కంఠేశ్వర్, మే 27: తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని అమ్మనగర్ కాలనీవాసులు మంగళవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మనగర్‌లో దాదాపు వారం రోజులుగా వీధిదీపాలు వెలగక అంధకారం నెలకొందని పేర్కొన్నారు. రాత్రుల్లో బయటికి రావాలంటే పాములు, తేళ్లతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. దీంతోపాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని, రోడ్డు గుంతలమయంగా మారిందని పేర్కొన్నారు. అధికారులు, నాయకులు స్పందించి తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు నరేశ్, స్వామియాదవ్, కిషన్, వినోద్‌కుమార్, మహేందర్, మధుసూదన్, ప్రవీణ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

## బాలల ప్రతిభ అద్భుతం

ఖలీల్‌వాడి/సుభాష్‌నగర్, మే 27: తల్లిదండ్రులు తమ పిల్లల్లోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జిల్లా విద్యాధికారి అశోక్ అన్నారు. బాలభవన్‌లో మంగళవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పిల్లల ప్రతిభా పాటవ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా హాజరై బాలభవన్ సిబ్బందిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో జిల్లా బాలభవన్ ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆత్మీయ అతిథిగా మనోరమా దవాఖాన నిర్వాహకులు డాక్టర్ హనీశ్ శశిధర్ దేశ్‌పాండే హాజరై మాట్లాడారు. బాల్ భవన్‌లో ఏప్రిల్ 16న ప్రారంభమైన శిక్షణ శిబిరం జూన్ 10 వరకు కొనసాగుతుందని పర్యవేక్షకురాలు ఉమాబాల తెలిపారు. చిన్నారుల డ్యాన్స్‌లు అలరించాయి. కార్యక్రమంలో ఉమాబాల, విఠల్ ప్రభాకర్, వెంకటలక్ష్మి, పుష్పలత, నటరాజ్, లక్ష్మణ్, రాంచందర్, గణేశ్, విజయ, గణేశ్, నమ్రత, శ్రీలత, సోనాలి పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని వినతి


కీర్తన విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

డిచ్‌పల్లి/ఇందల్వాయి, మే 27: మండలంలోని సుద్దులం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని జిల్లా కేంద్రంలో కలిశారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అదనపు గదులు, పోచమ్మ ఆలయం వద్ద బోరుమోటారు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వీడీసీ అధ్యక్షుడు సాయారెడ్డి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు.

**దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం**
దళితరత్న అవార్డు గ్రహీత ఎడవెల్లి సోమనాథ్‌ను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సన్మానించారు. నాయకులు శ్యాంసన్, వాసుబాబు, ధర్మాగౌడ్, కరుణ, మురళి, రామకృష్ణ, యాదయ్య, వెంకటి, దేవరాజ్, ప్రవీణ్, సూర్యతేజ, యూత్ ధర్మారం(బీ) యువకులు పాల్గొన్నారు.

**విద్యార్థినికి..**
ధర్మారం(బి) సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ బైపీసీలో 1000కి 993 మార్కులతో రాష్ట్రంలో నాలుగో స్థానం సాధించిన మల్లాపూర్ గ్రామానికి చెందిన తోట కీర్తనను ఎమ్మెల్యే భూపతిరెడ్డి జిల్లా కేంద్రంలోని తన నివాసలో సన్మానించారు.

## బోరు మోటరుకు మరమ్మతు



మోటర్‌ను రిపేర్ చేయిస్తున్న కార్యదర్శి

చందూర్, మే 27: నీటి సమస్యపై గ్రామ కార్యదర్శి స్పందించడం లేదు' శీర్షికన ఈనెల 26న 'నమస్తే తెలంగాణ'తో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల కేంద్రంలోని 13వ వార్డులో బోరు మోటర్ చెడిపోవడంతో కాలనీ వాసి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందించాడు. ఈ వార్త నమస్తే తెలంగాణలో ప్రచురించడంతో స్పందించిన అధికారులు మంగళవారం ఉదయం బోరుమోటర్‌కు మరమ్మతు చేయించారు. కాలనీ వాసులకు నీటిని అందించారు.

## బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

చందూర్ , మే 27: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు కోటగిరి రాములు యాదవ్‌ను మంగళవారం బాన్సువాడ పురపాలక సంఘం మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ మండల నాయకులతో కలిసి పరామర్శించారు. అండగా ఉంటామని మనోధైర్యం చెప్పారు. మాజీ సొసైటీ చైర్మన్ మాధవరెడ్డి, కార్యకర్తలు శ్రీనివాస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన 31 మంది పై కేసు నమోదు

- ఐదుగురికి జైలు శిక్ష.. 26 మందికి జరిమానా

వినాయక్‌నగర్, మే27: డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్‌తో వాహనదారులకు పరీక్షలు నిర్వహించారు. 31 మంది వాహనదారులు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడగా వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వారికి ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం వారిని మార్నింగ్ కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. వారిలో ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష , ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. మిగతా 26 మంది వాహనదారులకు జరిమానా విధించచారు.

**ఒకరికి రెండురోజుల జైలు శిక్ష..**
ముప్కాల్, మే 27: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిర్మల్ జిల్లా గంజాల్ గ్రామానికి చెందిన ముదారం శంకర్‌కు ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా గంజాల్ గ్రామానికి చెందిన ముదారం శంకర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు.

## ఆశ్రమంలో దుస్తుల పంపిణీ

కోటగిరి, మే27: మండలంలోని ఎక్లాస్‌పూర్ పంచాయతీ పరిధిలో ఉన్న గుమ్మడి ఫౌండేషన్ అనాథ ఆశ్రమం రెండేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఫౌండేషన్ నిర్వాహకులు అనాథ ఆశ్రమంలో పేదలు, సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ ఆశ్రమం అనాథ పిల్లలకు ఎంతో ఆసరాగా నిలిచిందని మాజీ జడ్పీటీసీ శంకర్‌పటేల్ అన్నారు. కార్యక్రమంలో రంగబాబు, రాధాకృష్ణ, గుమ్మడి శ్రీహరి, బ్యాంకు మేనేజర్ శివకుమార్, ట్రాన్స్‌కో ఏఈ బుజ్జిబాబు, ఆశ్రమ నిర్వాహకులు మధుకర్, రామకుమార్ బండి తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంతమైన వాతావరణంలో
## పండుగ జరుపుకోవాలి


సాటాపూర్‌లో మాట్లాడుతున్న ఎస్సై చంద్రమోహన్

రెంజల్, మే 27 : రానున్న రోజుల్లో జరుపుకునే బక్రీద్ పండుగను శాంతి భద్రతలకు విఘాతం కల్గించకుండా ప్రశాంతమైన వాతావరణంలో మండల ప్రజలు జరుపుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై చంద్రమోహన్ సూచించారు. మండలంలోని సాటాపూర్ రైతు వేదిక భవనంలో మత పెద్దలతో కలిసి మంగళవారం శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జూన్ 7న బక్రీద్ పండుగను పురస్కరించుకొని గోవధ చట్టాన్ని అనుసరించి పండుగను జరుపుకొని తమతో సహకరించాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ వికార్‌పాషా, పశుసంవర్ధక శాఖ సహాయకులు, గ్రామ కార్యదర్శులు, మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

నవీపేట, మే 27: నిబంధనల ప్రకారం ఎరువులతో క్రిమి సంహారక మందులను విక్రయించాలని, ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి నవీన్‌కుమార్ హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఫర్టిలైజర్ డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారమే ఎరువులు క్రిమిసంహార మందులను రైతులకు విక్రయించాలని సూచించారు.

## ఎంపీకి విశ్వబ్రాహ్మణ నాయకుల వినతి

నవీపేట, మే 27: జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు కమ్యూనిటీ భవన నిర్మాణానికి గాను నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం గ్రామ మాజీ సర్పంచ్ ద్యాగ సరిన్ ఆధ్వర్యంలో నాళేశ్వర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సహకార సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కమ్మరి సుదర్శన్, అవసలి శ్రీనివాస్, మురళి, విఠల్, కమ్మరి గారిబ్ బాబు, కమ్మరి కిషన్, వడ్ల భూపతి, వడ్ల బ్రహ్మయ్య, కన్నయ్య, భూజేందర్, శంకర్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ఆర్మూర్ టౌన్, మే 27 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని సీఐ సత్యనారాయణ గౌడ్ అన్నారు. జాతీయ అవార్డు గ్రహీత, సామాజిక సేవకురాలు పట్వారీ తులసితో కలిసి మంగళవారం ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కోరారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి

ఆర్మూర్ టౌన్, 27 : ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రీనగర్, ఆర్మూర్ ఏరియా ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు సీపీఎం కార్యదర్శి కూతాడి ఎల్లయ్య మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# రసాయన ఎరువుల తగ్గుదలే నేలకు రక్ష



మెండోరాలో రైతు సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త మంజు భార్గవి

భీమ్‌గల్, మే 27: రసాయన ఎరువులు తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే నేల తల్లిని రక్షించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మంజుభార్గవి అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని మెండోరాలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో రైతులనుద్దేశించి మాట్లాడారు. తక్కువ యూరియాను వాడడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. ఎరువులు, విత్తనాల రసీదులను భద్రపరచడం ద్వారా కష్టకాలంలో నష్ట పరిహారం పొందవచ్చన్నారు. సాగునీటిని ఆదా చేసి భావి తరాలకు అందించాలని సూచించారు. మరో శాస్త్రవేత్త దుర్గారాణి మాట్లాడుతూ ప్రస్తుతం నెలకొంటున్న వాతావరణ మార్పులను వివరిస్తూ పంటల మార్పిడి సరైన ప్రణాళికతో చేస్తే రైతులకు తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయధికారిణి లావణ్య, వ్యవసాయ విస్తీర్ణాధికారులు భార్గవ్, ఉద్యానవన శాఖాధికారి రోహిత్, ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, డైరెక్టర్ చినబాబు, రైతులు పాల్గొన్నారు.

**కొత్త పద్ధతులతో అధిక దిగుబడి పొందొచ్చు ..**
వేల్పూర్, మే 27 : రైతులు వ్యవసాయ సాగులో కొత్త పద్ధతులతో ముందుకు కొనసాగితే అధిక దిగుబడులు పొందవచ్చని శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు సాగు విధానంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆకుల దినేశ్, శ్రీలత మాట్లాడుతూ వ్యవసాయ సాగులో రైతులు కొత్త పద్ధతులను పాటిస్తూ కొత్త వంగడాలపై తక్కువ యూరియా వాడాలని, ప్రతి రైతు కూడా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కమిటీ సభ్యులు నర్సింహనాయుడు, పశు వైద్యాధికారి సంతోష్‌రెడ్డి, వ్యవసాయాధికారి శ్రుతి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొతంగల్, మే 27: మండలంలోని కల్లూర్‌లో చెరకు, వరి పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ సమన్వయంతో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని, అవసరం మేరకే రసాయనాలను వినియోగించాలని రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి నిశిత మాట్లాడుతూ.. విత్తనాలు, మందులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులను తీసుకొని పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త ఎం.సాయిచరణ్, రుద్రూర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రశాంతి, వెటర్నరీ అండ్ లైవ్ స్టాక ఆఫీసర్ నారాయణ, వ్యవసాయ విస్తరణాధికారి సుప్రియ, గ్రామ సెక్రటరీ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి


బోధన్‌లో నూతనంగా నిర్మించిన కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్, మే 27: ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని పలు ప్రాంతాలను ఆయన మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, అధికారులతో కలిసి పరిశీలించారు. శక్కర్‌నగర్ చౌరస్తా నుంచి తట్టకోట్‌కు వెళ్లే రహదారి పక్కన నిర్మించిన కల్వర్టును పరిశీలించారు. మురికి నీరు బయటికి వెళ్లేందుకు నిర్మించిన ఈ కాలువలను వెడల్పు పెంచి నిర్మిస్తే బాగుండేదని, ఇతర కాలువలు ఇలా నిర్మించవద్దని అధికారులకు సూచించారు. అనంతరం నల్ల పోచమ్మ మందిరం వద్ద నీరు నిలుస్తున్నదని అందిన ఫిర్యాదు మేరకు సదరు స్థలాన్ని పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం పట్టణంలోని 5వ వార్డులో షర్బతీకెనాల్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, గడుగు గంగాధర్, నగేశ్‌రెడ్డి, డీఈఈ యోగేశ్, ఏఈలు శ్రీనివాస్, ముఖయ్యార్ తదితరులు ఉన్నారు.

**విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురికి ఎక్స్‌గ్రేషియా..**
శక్కర్‌నగర్, మే 27: ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ముగ్గురికి గాను ఒక్కొక్కరికీ రూ.5లక్షల చొప్పున మంజూరైన ఎక్స్‌గ్రేషియా చెక్కులను బోధన్ పట్టణంలో ఎమ్మెల్యే పి. సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా మృతుల కుటుంబీకులకు అందజేశారు. రెంజల్ మండలం సాటాపూర్ గ్రామానికి చెందిన ఒడ్డెర గంగారాం, ఒడ్డెర బాలమణి, ఒడ్డెర కిషన్ బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామశివారులోని ఓ పంటపొలం వద్ద విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందగా తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ రూ.15లక్షల విలువైన చెక్కులను జారీ చేసింది.

## తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందిపేట్, మే 27 : అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహిస్తూ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, దేవన్న, రాజలింగం, మల్లన్న పాల్గొన్నారు.

## ఉచిత ఆస్టియో పోరోసిస్ పరీక్ష శిబిరం

బోధన్, మే 27: బోధన్ పట్టణం గోశాల రోడ్డులోని ఇండస్ డాక్టర్ ప్రసాద్ దవాఖానలో మంగళవార ఉచిత ఆస్టియో పోరోసిస్ పరీక్ష (ఎముక సాంద్రత పరీక్ష) శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎముక సాంద్రత పరీక్షను వైద్య సిబ్బంది ఉచితంగా నిర్వహించి పరీక్ష చేయించుకున్నవారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రసాద్‌రావు పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు.

## ఎస్సారెస్పీకి తగ్గిన వరద

మోర్తాడ్, మే 27: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద తగ్గింది. సోమవారం వరకు ఎగువ నుంచి ప్రాజెక్ట్‌లోకి 2వేల క్యూసెక్కులకు పైగా వరదరాగా మంగళవారం కేవలం 652 క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1061.70అడుగుల(12.208టీఎంసీలు) నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తుండగా, 321 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వెళ్తున్నది.

## టీయూఐసీ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

శక్కర్‌నగర్, మే 27: జిల్లా కేంద్రంలో జూన్ ఒకటిన నిర్వహించనున్న టీయూఐసీ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సదరు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బండారు మల్లేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం బోధన్ పట్టణంలోని రాకాసీపేట్‌లో నిర్వహించిన టీయూఐసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభను విజయవంతం చేసేందుకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు జె. మక్కయ్య, మిడ్‌డే మీల్స్ నాయకురాలు రేహానా బేగం, బీడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు బి.నాగమణి, బీపాషాబేగం, డి.నాగేశ్వర్, నాగరాజు, పద్మ, కమల పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ వద్ద నెహ్రూకు ఘన నివాళి


ఎస్సారెస్పీ వద్ద నెహ్రూ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

మోర్తాడ్, మే 27 : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 61వ వర్ధంతిని మంగళవారం శ్రీరాంసాగర్ సర్కిల్, డివిజన్ ఉద్యోగులు నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీఈఈ గణేశ్ మాట్లాడుతూ..వృథాగా సముద్రంలోకి వెళ్తున్న వేలాది టీఎంసీల నీటికి అడ్డుకట్ట వేసేందుకు 1963లో ఎస్సారెస్పీ నిర్మాణానికి నెహ్రూ పునాది వేశారని, ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం కావడంతో ఉత్తర తెలంగాణకు సాగునీటిని అందించే వరప్రదాయినిగా మారిందన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఈ లాల్ సింగ్, సూపరింటెండెంట్లు గోదావరి, రవీందర్, ఎస్సారెస్పీ టీఎన్‌జీవో అధ్యక్షుడు ప్రవీణ్‌రాజ్, ఉపాధ్యక్షుడు నరేందర్‌గౌడ్, ఏఈఈ శ్యామ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

**ఆర్మూర్ పట్టణంలో..**
ఆర్మూర్ టౌన్, మే 27: ఆర్మూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, అశోక్‌నగర్ కాలనీలో మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ ఆధ్వర్యంలో నివాళలు అర్పించారు.

## ఇందిరమ్మ ఇండ్లపై సమీక్ష

భీమ్‌గల్, మే 27 : మండలంలోని దేవన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై మంగళవారం ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ కార్యదర్శి, హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో గ్రామానికి ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయి, ఎన్ని నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి తదితర అంశాలపై చర్చించారు. ప్రారంభించని వాటి విషయంలో ఎందుకు ఆలస్యం జరుగుతున్నది, లబ్ధిదారులకు ఏమైనా ఇబ్బందులు, సాంకేతిక కారణాలు ఉన్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు.

**ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు..**
మాక్లూర్, మే 27 : మండలంలోని మాక్లూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీ కాలనీలో మంగళవారం అధికారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని, అధికారులు కొలతలు చేస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైనట్లు ఎంపీడీవో లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఇండ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి..**
నవీపేట,మే 27: మండల కేంద్రంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సీపీఎం మండల కార్యదర్శి నాయక్‌వాడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పేదలు వినతి పత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో ఖాళీ స్థలం ఉండి అద్దె ఇంటిలో ఉంటున్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.